భూస్వామ్య వ్యవస్థలో అర్థబలం కంటె అంగబలం గొప్పది. అందుకే ఆ వూళ్ళో రంగయ్య కంటె రాఘవయ్య గొప్పోడు. అలాగని రాఘవయ్యకు అర్థబలం లేదనికాదు. రంగయ్యకులేని, మరో అర్హత రాఘవయ్యకు అదనంగా వుందని మాత్రమే దీని అర్థం.

గ్రామీణ సమాజంలో ఏదో ఒక వర్గం, దాని సంఖ్యా బలాన్ని బట్టి ఆధిక్యతని నెరపుతూవుంటుందని సామాజిక అవగాహన వున్న ఏ సామాన్యుడికైనా అర్థమవుతుంది. ఆ వర్గం ఆర్థికంగానూ పైమెట్టులో వుంటే ఇహ చెప్పాల్సిన అవసరమేవుండదు. రాఘవయ్య అలాంటి వర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్నాడు నాయకత్వాన్ని ధరిస్తున్నాడు.

రంగయ్యకి పక్క పట్నంలో బంగారం వ్యాపారం వుంది. దాని చాటున వడ్డీ వ్యాపారం కూడా సాగుతోంది. అతని వ్యాపారానికి, ఆ మాటకొస్తే ఏ వ్యాపారానికైనా సరే గిరాకీని పలికించే పెద్ద చేయి ఒకటి వెనక వుండాలి. అందుకు రంగయ్యకు రాఘవయ్య అవసరం.

రాఘవయ్య భూస్వామి. ఆ వూరికి మోతుబరి. అతని చేతికింద బతికే సన్నకారు రైతులూ, పేదకూలీలూ ఎందరో వుంటారు. వాళ్ళకి అవసరం అయినప్పుడు ఆర్థికంగా ఏదో కాస్త సాయపడుతూ వుండాలి. అసాంతం తన జేబులోంచి చేసేటంతటి అవివేకి కాదు రాఘవయ్య. వాళ్ళ అర్హతల్ని బట్టి, తన అనుకూలాన్ని బట్టి, రంగయ్యకు సిఫార్సు చేసి పంపిస్తూ వుంటాడు. అందుకు రాఘవయ్యకి రంగయ్య అవసరం.

ఇలా ఉభయతారకం అయిన వారి మైత్రి మూడునోట్లు, ఆరుజప్తులుగా అభివృద్ధిచెంది బల పడుతోంది. అంతకు రెట్టింపుగా ఆ వూళ్ళోని పేద రైతాంగం కూలీలుగా మారిపోతూనే వున్నారు. అదుగో, ఆవళకు దగ్గర పడ్డ వాడే పద్దయ్య. మేడుపట్టిన ఆ రైతు, కాడి మోసి వాడిపోయిన ముసలెద్దులా బక్కచిక్కి, అరిగిన జీవితం, తరిగిన వయస్సూ మూర్తీభవించిన ముసలి పీనుగులా రాఘవయ్య ఇంటి ముందు నుంచుని వున్నాడు. రాఘవయ్యేమో మాంచి హడావిడిలో వున్నాడు. హడావిడంటే అంతా ఇంతా కాదు. అసలు అదంటే ఏమిటో ఆలోచించటానికి కూడా అరక్షణం తీరిక లేనంత హడావిడిగా వున్నాడు.

అమెరికాలో వైద్యం చదువుతున్న ఓ అల్లుణ్ణి నాలుగు లక్షలను కొనుక్కుని కన్యాదానం చేయబోతున్నాడు. పెళ్ళేమో ఆ మర్నాడేనాయె! ఎన్ని ఏర్పాట్లు చూసుకోవాలి? పైగా రామినాయుడు తన కూతురికి రెండు లక్షలే కట్నం యిచ్చేడు. మరి అతని హోదా యెక్కడ? తన హోదా ఎక్కడ? రామునాయుడి కూతురి పెళ్లి వూరందరి పెళ్లిలా జరిగింది. మరి తన యింట్లో పెళ్లి ఏ విధంగా చూసినా అంత కంటె చాల గొప్పగా వుండాలి. అందుకే— మానసికంగానూ, శారీరకంగానూ కూడా చాల బిజీగా వున్నాడు రాఘవయ్య. ఎంత బిజీగా ఉన్నా పబ్లిక్ రిలేషన్స్ పాడు చేసుకోడతను. అందుకే పరుగెత్తుకొచ్చేడు పద్దయ్యను చూడ్డానికి.

అరగంటనించీ అంగలారుస్తూ నుంచున్న మనిషి రాఘవయ్య ఎదురు పడగానే చూడ్డా

# ఊబి

కె.కె. మీనన్

నికే చచ్చేంత సిగ్గుపడి పోయాడు పద్దయ్య. అందుకు కారణం లేకపోలేదు.

* * *

"అమ్మాయి పెళ్లికి సొమ్ము అవసరం అయ్యేట్టుంది. ఆ బాకీ జమకట్టెయ్యి పద్దయ్యా"

పది రోజుల క్రితం పద్దయ్యను పిలిపించి అడిగేడు రాఘవయ్య.

"నా దగ్గర పైసా లేదు బాబయ్యా. అయినా తమరికి జరూరు అంటున్నారు గాబట్టి ఎక్కడయినా తిప్పలు పడతాను. ఎంతయిందో చెప్పండి" అడిగేడు,

కాగితాలు తీసి ఏదో లెక్కలు కట్టి—

"రంగయ్య నుంచి నోటుబదిలీ చేసుకునే రెండేళ్లు కావస్తోంది. అసలు వడ్డీకలిపి పది వేలయింది."

పద్దయ్యకు పై ప్రాణాలు పైనే పోయాయి.

"అదేంటి బాబయ్యా. రంగయ్య పాప కాదు అన్యాయం చేస్తాడనేగదా తమరు బదిలీ చేసుకుంది. తమరే సేను మేసేత్తే...."

"అపవయ్యా ఏ సామెతలూ మువ్వనూ.... భూమి జప్తు చేస్తున్నారు కాబట్టి. నేనైతే తిరిగ్గా తీర్చుకోవచ్చని ఆ మాత్రం సాయం చేసేను. అదీ తప్పే......"

"తమరన్నదేంటంటే...."

"చాల్లేవయ్యా చెప్పొచ్చావు. అత్యవసరం అప్పుడిది బదిలీ చేయించుకోమన్ని కాళ్లావేళ్లా పడ్డావు. నువ్వే చావు చస్తావో నా కదంతా అనవసరం. నాకు వెంటనే పైకం కావాలి" అని లోపలికెళ్లి పోయేడు రాఘవయ్య.

పద్దయ్య కాళ్లు ఊబిలో దిగబడి పోతున్నట్టు భారంగా నడిచి యింటికి వెళ్లేడు. ఒకరిద్దరు యువకులు దార్లో విషయం అడిగి తెల్సుకుని—

"ఇలా ఊరుకుంటే కాదు. పంచాయితీలో పెట్టాలి" అని సలహా యిచ్చేరు.

"పంచాయితీ ఎక్కడిది బాబూ. అది మాత్రం ఆయన జేబులోందిగాదూ?" అన్నాడు. అయినా విన్నారుకాదు పద్దయ్యను ఎగదోసి పంచాయితీకి పంపించేరు.

తగువు విచారణ కొచ్చింది.

ఊరు తగలబడి పోతున్నా పట్టించుకోని నీరో ప్రభువులు కూడా ఆరోజున అక్కడ హాజరయ్యేరు.

"అసలు జరిగిన గొడవేంటి?" భుజం మీదకండువా సర్దుకుని, చుట్ట అట్టించుకోడానికి కొస కొరికి ఉమ్మేయటం లాంటి ప్రాథమిక చర్య ముగించి ప్రారంభించేరు సర్పంచ్ గారు.

"అదో పెద్దకథ...." అంటూ మొదలెట్టబోయేడు రాఘవయ్య

"అలా వీల్లేదు. మొదట పద్దయ్యను చెప్పుకోనివ్వండి" అంటూ ఓ యువకుడు అభ్యంతరాన్ని తెలిపేడు.

"ఎవడు చెపితే ఏమయిందిరా పిచ్చోడా. సరే అలాగే కానీండి పోనీ.... నువ్వే చెప్పరా పద్దయ్యా....

పద్దయ్య లేచాడు.

"అయిదేళ్ళ కితమండి బాబయ్య, మా రెండోదాని పెళ్ళి చెయ్యాలని రాఘవయ్య బాబుని అయిదేలప్పడిగేనండి. ఆరేమో

రంగయ్యకి సీటీ యిచ్చి పంపారండి: రంగయ్య కాదేమో పెళ్లికి అంత సొమ్మెందుకు మూడేలు సాల్తయి లెమ్మన్నాడండి. నేనన్నానండి. అలాగ్గాదు. బాబయ్యా. పెద్దదాని పురుడు గూడ ఇబ్బంది, అసలే తొలిసూలు కానుపూ, దానికి సారీ, సీరా పెట్టకపోతే బాగుండదు.... దానికే అవుద్దిగదా బాబయ్యా మూడేలు, అన్నానండి. ఏదో కిందబెట్టి పైనబెట్టి అయిదేలూ సేతిలో బెట్టాడండి. అందులో ఏం రాసాడో అచ్చరం ముక్క రానోణ్ని నాకేం తెలుస్తది సెప్పండి. యేలి ముద్దరేసానండి. తీరా పంటలమ్మి జమకడదామని యెల్లేక అసలు ఎనిమిదేలు, ఒడ్డీ పదేనొందలూ లెక్క సెప్పేడండి ఇదేం అన్యాయం బాబయ్యా అంటే, అదంతే నువ్వెట్టికెల్లిందే రాసానన్నాడు. ఆ పళంగా రాఘవయ్య బాబుతోటి మొరెట్టుకున్నానండి. ఆరేమో పరవాలేదులే, ఆ డబ్బు కట్టొద్దు పెట్టుబళ్ళకి దాసుకో, అన్నాడండి. సరే లెమ్మని ఊరుకున్నానండి. రొండు నెల్ల తరవాత ప్లీడర్నోటీసిప్పించాడండి రంగయ్య సావుకారు: నోటొదిలించుకోకపోతే బూవి జప్తు సేత్తానన్నాడండి. ఇదేంటి బాబయ్యా, తవరేదో సూసుకుంటావన్నారని ఊరుకున్నానని ఆ మారాజుతో మొరెట్టుకున్నానండి. ఆరేమో రంగయ్యమీద మండి పడిపోయి. యెదవసావుకారు బుద్ధి పోనిచ్చుగున్నాడు గాఎ. ఏమైనా సరే అయిదేలకే నయాపైసా గూడ ఎక్కువియ్యొద్దు ఏం సేత్తాడో సూద్దాం. అంతగా లేదంటే ఆనోటు నానే టాన్స్పరు సేయించుకుంటాను తీరగ్గా తీర్చుకుందువుగాని. అన్నాడండి అన్న మారాజు అన్నట్టె సెయ్యాలి గదండి ఉప్పుడేమో పదేలకి పైసా తగ్గేదిలేదు ఇత్తావా సత్తావా అంటున్నాడండి. ఇదేం అన్యాయం సెప్పండి" అని ఆయాసం తీర్చుకున్నాడు పద్దయ్య.

సభలో పెద్ద గందరగోళం లేచింది.

రాఘవయ్యనిలబడి—

"వాడెంత ఇచ్చాడో, వీడెంతకి నోటు రాశాడో యీ తబిశీళ్ళన్నీ నాకనవసరం. రంగయ్య ప్లీడరు నోటీసిచ్చేక నా దగ్గరికి పరుగెత్తుకొచ్చి ఆపదలో ఆదుకొమ్మని కాళ్ళా వేళ్ళా పడ్డాడు. ఆది అబద్ధమేమో అడగండి

"అబద్ధవని నానన్నానా బాబయ్య"

"తీరిగ్గా తీర్చుకుందువుగాని నోటునే బదిలీ చేయించుకుంటానన్నానా లేదా?"

"ఆ మాటా జెప్పా గదండి"

"మరిందులో నేన్జేసిన అన్యాయం ఏముంది? నోటు బదిలీ చేయించుకున్నప్పుడు, అందులో రాసిన సొమ్ము తగ్గించే ప్రశ్నే ముంది?"

అవునంటె అవునన్నారంతా.

చివరకి అప్పు తీర్చాలనే తీర్మానం జరిగింది.

"సిల్లిగవ్వ చేతిలో లేదు. ఎట్టా తీరుత్తాను" అన్నాడు పదయ్య.

"సిల్లిగవ్వ లేకపోతే పొలం వుందిగా రాసెయ్యమనండి"

చివరికి అదే ఖాయం అయింది.

ఇంటికెళ్ళేప్పటికి భార్య నిప్పుమీద ఉప్పురాయిల్లా పెటపెట్లాడిపోతోంది.


రాజేశ్వరి ఐస్ పార్లర్

&

జనరల్ స్టోర్సు

పెద్దగోపురం వద్ద

పాలకొల్లు

కొటికలపూడి రాజమోహనరావు

పార్టనర్

"ఎదిగిన ఆడపిల్లని ఇంట్లో పెట్టుకున్నకుంటే ఇలాగే వుంటుంది. దాన్తప్పే వుంది."

సరిగ్గా ఈ సమయంలోనే గుమ్మం యెక్కేడు పద్దయ్య

"అప్పులెయ్యటం పంచాయితీ సుట్టూ తిరగడంతోటే సరిపాయె. ఇంక ఆడపిల్ల పెళ్ళి గురించి ఆలోచించే వోపికెక్కడిది" అంటూ మీద పడింది.

ఆమెకు సర్ది చెప్పుకునే ఓపిక కూడా సన్నగిల్లిపోయింది, పద్దయ్యలో. మాట్లాడకుండా వెళ్ళి బల్లమీద ఒళ్ళు వాల్చేడు.

"ఎన్నన్నా దున్నపోతు మీద వానగుర్సినట్టే" అని తన వన్లో తను మునిగిపోయింది భార్య.

కాని యీ పోరు ఇంతటితో ఆగిపోలేదు. సంబంధం కుదిర్చేవరకూ అలా సాగుతోనే వుంది. తీరా సంబంధం కుదిరేక డబ్బు సమస్య....

మళ్లీ రాఘవయ్య తప్ప వేరే గత్యంతరం లేకపోయింది

పద్దయ్య పేరు వినగానే తన పొలం పక్కపొలం, బదిలీచేసుకోని రంగయ్య నోటూ- అన్ని గుర్తుకొచ్చేయి.

పరుగెత్తుకొచ్చేడు.

* * *

"ఏం పద్దయ్యా" పలకరించేడు.

ఉలిక్కిపడ్డాడు పద్దయ్య. ఆలోచనల్లనుంచి ఆకస్మాత్తుగా తేరుకుని —

"తప్పయిపోయింది బాబయ్యా సెమించాల" అన్నాడు

"ఏవిటది?" ఏమీ ఎరగనట్టే అడిగేడు రాఘవయ్య.

"తవర్ని యీదిలోకీడిసి నవ్వుల పాల్జేశాను" అన్నాడు తలొంచుకునే.

పకపకా నవ్వేడు రాఘవయ్య.

మరింత సిగ్గుపడిపోయేడు పద్దయ్య.

నవ్వి నవ్వి ఆయాసపడి, తెములుచుకుని-

"పిచ్చోడా. నన్ను నవ్వుల పాల్జేసవాడెవడయ్యా. ఒకవేళ చేయాలని ఎవడన్నా అనుకుంటే, వాడే నవ్వుల పాలౌతాడు తెల్సిందా?"

తెలిటం ఏవిటి! అనుభవమే అయితేను-

పది నిముషాలపాటు మాటా మంతీ లేకుండా అలానే నిలబడిపోయేడు పద్దయ్య.

అంతకంటె యెక్కువ సమయాన్ని వృధాచేయటమూ రాఘవయ్య అభిమతం కాదు.

"ఇంతకూ, వచ్చిన పనేవిటో చెప్పేవు కాదు" అంటూ గుర్తు చేసేడు

ఆ వచ్చిన పనేదో పెద్దదే అయి వుంటుందనీ, లేకుంటె వూరకే క్షమాపణ చెప్పుకోడానికేవచ్చి వుండడని రాఘవయ్యలాటి లౌక్యుడికి తెలీకుండా వుంటుందా?

"తవరికి తెలవందేముంది బాబయ్యా. యీసారి గూడా తవరే ఆదుకోవాలి" అంటూ చేతులు నలిపేడు పద్దయ్య.

"ఏవిటో అది?"

"అయిదుగు రాడపిల్లల పెళ్ళిళ్ళు తవరి చేతుల మీదే జరిపించారు ఇదే ఆఖరిపిల్ల. ఇదిగూడా తవరే..........."

అంటూ నీళ్ళు నమిలేడు?

"పిల్ల చిన్నదిగా? అప్పుడే అంత తొందరేవిటి?"

"పిల్ల సిన్నదేగాని బాబయ్యా" అని కాస్సేపాగి మళ్ళ—-

"తవరికి సెప్పుకోక యింకెవరికిసెప్పుకుంటాగాని, పిల్లకాన పెద్దపన్లే సేత్తందనియిన్నానండి"

ఆ విషయం రాఘవయ్యకు తెలీందిగాదు. ఒకవేళ ఈ అప్పు సమస్య ఒక కొలిక్కిరాకపోతేఆ రెండెకరాలూ తన పొలం లోకలవకపోతే తురుపాసుగా యీ అస్త్రం తన చేతిలో పెట్టుకునే వున్నాడు. ఆ అవసరమే లేకపోయింది. కాబట్టి తనకు తెలీనట్టే నటిస్తే—

"అంతటిఘనుడెవ్వడయ్యా" ఈఊళ్ళో అలాంటి అప్రాచ్యపు పనులే జరగటానికి వీల్లేదన్నట్లు మాట్లాడేడు.

ఇక ఆ ప్రస్తావన ఆపుచేయటం మంచిదనుకున్నాడు పద్దయ్య.

తనకు అక్కరకు రాని సమస్య మీద సంభాషణ పొడిగించటం రాఘవయ్యకూ యిష్టంలేదు.

"ఎందుకు లెద్దూ కడుపు చింపుకుంటే కాళ్ళమీద పడ్తుంది" అని తుంచేశాడు.

కాస్సేపు మౌనం తర్వాత-

"ఇంతకీ నన్నేం చేయమంటావు?" అనడిగేడు రాఘవయ్య.

"ఆ రెండెకరాలూ ఎలాగూ తవరికే రాసేత్తన్నాగదండి బాబయ్యా. ఇంకున్నది ఒక్క యకరం. అదిగూడ దాంతోబాటే రాయించేసుకుని యేదో తవకి తోసింది యిప్పించండి. ఆ పెళ్ళి గూడ అయిందనిపించేత్తాను,"

ఏదో ఆలోచిస్తున్నట్టు నటించేడు రాఘవయ్య.

తర్వాత—

"మరేం లేదుగని పద్దయ్యా, నీ ఆస్తంతా కాజేసానని లోకులు ఆడిపోసుకుంటారని భయంగా వుందయ్యా" అన్నాడు.

"బాబ్బాబు అలా అనుకోమాకండి. లోకులు కాకులు బాబయ్యా. ఎలాగన్నా కూత్తారు. నాకు అనుభవం అయింది గదండి. ఇప్పుడు తవు సెయ్యలా వెనక్కి తీసేసుగుంటే నానే యేట్లోగల్చిపోవాల సెప్పండి" అని అంగలార్చేడు పద్దయ్య.

"నిజమే అనుకో, కానీ — అంతా నీలా అనుకుంటారా చెప్పు. రేపు ఆమాటే గనక ఎవడన్నా అంటే, ఇక వీధిలో తలెత్తుకు తిరగ్గలన్నా?...." అని కాస్సేపాగి.

"హూ....సర్లే.........మనిషన్న తర్వాత కాస్త కష్టం సుఖం అంటే ఏవిటో తెల్సుకోవాలి. కష్టాల్లో వున్నప్పుడు ఇంక అవన్నీ పట్టించుకుంటూ కూర్చుంటే ఎట్లా.... సరెలే ఏదో చూద్దాం——" అంటూ హడావుడిగా లోపలికెళ్ళిపోయేడు.




పెళ్ళి పనులన్నీ పూర్తయి నట్టున్నాయి. కూలిడబ్బులు కోసం బిచ్చగాళ్ళలా నిలబడి వున్నారు కూలీలు. వాళ్ళని చూడగానే వెన్నెముక చురుక్కుమంది పద్దయ్యకు. తనిక రైతు కాదు కూలీ........

●